హిందు - ముసల్మాన్

ఎడతెగని మైదానం. ఉత్తరానికి కొండలు తప్ప ఏమీ కనపడవు. అక్కడక్కడ ముళ్ళపొదలు, ఆకులు పిండినా ఒక్కచుక్క రసంకాదు.

ఆ గుంపులో కొద్దిమంది ధనవంతులు, సంస్కారులు, జ్ఞానులు, చాలామంది కటికబీదలు ఎండనెరగని గోషాస్త్రీలు. ఆకలి నెరగని పసిపిల్లలు. సామానులేదు, మూటలు లేవు, ఏమీలేవు. మైదానపు ధూళి ధనవంతుల్నీ, బీదల్నీ, భేదంచూపక, కప్పేసింది. కళ్ళనిండా, ముక్కులనిండా కూడా ఎర్రనిదూళి. యువకుల వొంటికి గాయాలు, నెత్తురు ఎండి నల్లగా గడ్డకట్టిన గాయపు పుళ్ళు. కట్లు, ఒకామెకి రొమ్ములుకోసిన గాయాలు, ఒకామెకి అసలు కళ్ళేలేవు. గొప్ప సౌందర్యం ఒకామెది. ఏ దేశపు రాణి ఈమె అనుకుంటారు. ఇప్పటికీ లొంగని ఆమె ఠీవినిచూస్తే, ఎంతకాలంనుంచి నడుస్తున్నారో, వెనక పడేవారిని తోసుకుంటూ తివాసీలపైన మొహమల్ జోళ్ళతో నడవడం భారమనుకున్న ఆ పాదాలతో.

"ఎప్పుడు ఇంటికి వెడతాం?" అని ఏడ్చింది తొడలు గాయమై నడవలేని ఓ పిల్ల.

"అల్లా!" అని బిగ్గరగా మైదానం అదిరేలాగు ఏడ్చింది ఓ ముసలమ్మ. ఆమె దవడ నిలువునా చీలివున్న సంగతి మరచి, బాధవల్ల చప్పున ఆగింది ఆ ఆర్తనాదం.

"వూరుకో, అరవకు" అని విసుక్కున్నాడు చెయ్యితెగిన ఆమె మనమడు యూసఫ్.

ఎంత మంటపెట్టినా అంటుకోని తన రాతిగోడల మందిరాన్ని తలచుకుంటున్నాడు అతని తండ్రి జాగీర్‌దార్.

"వాడు నల్లటివాడు. వాడే అసలు నువ్వు చచ్చినాసరే, వాణ్ణి ఓ పోటు పొడవగలిగి వుంటే నాకీస్థితికూడా ఇంతబాధగా వుండకపోను" అన్నాడు యూసఫ్‌తో.

"మన సఫేరాని—" అని గబగబ యేడ్చాడు యూసఫ్.

పది నిమిషాలు తంటాలుపడి యేడుపుని మింగి "దూకాను ఆ కాఫర్‌మీదికి. కాని, మధ్యలో మన సఫెరాని—ఒకడు—నా ముందే లంగా చించేసి—"

వేళ్ళు తిమ్మిర్లెక్కాయి. పైకికిందికి ముడుచుకున్నాడు. పడమటి సూర్యుడికేసి చూశాడు.

వెనకనించి "సఫేరా" అని పెద్ద కేకవేసి పడిపోయింది ఒకామె.

ఎట్లా? దోవ పొడుగువా ఇట్లా ఈ ఆడవాళ్ళు పడిపోతూవుంటే..."

ఎక్కడన్నా వూరు కనపడుతుందా? ఎట్లా సమీపించడం? గుర్తుపట్టడంతో నరికేస్తారు. ఇదంతా హిందూరాజ్యం.

ఆమెకోసం అందరూ విశ్రమించారు. మొహాన చల్లడానికైనా నీళ్ళులేవు.

"ఈవాళ నవాబ్, రేపు చప్రాసీ: ఎంతచిత్రం అల్లాలీల" అన్నాడు ఒక ముసలి సాహెబు నాలుగు ఈకెల గడ్డాన్ని ఆడిస్తో!

"ఏం చేశాం? వాళ్ళకేం అపకారం చేశాం? ఎందుకు మనపైన ఇంతకసి?" అని దిక్కుల్ని అడిగింది ఒక యవ్వనవతి. ఎన్నడూ పత్రికలు చదవవలసిన అగత్యం పట్టని పుణ్యవతి. తన ఎదురుగా తన భర్తని కట్టి, తనని అవమానంచేసి, అతని గుడ్లని ఊడబెరికిన చిత్రవధ దృశ్యాన్నిచూసి కూడా బతికి వున్నానే అని ఆశ్చర్యపడే ఆ యువతి.

ఆ మూర్ఛపడ్డ ఆమె పిలుస్తోంది.

"యూనేన్, టీ తీసుకురా." అని.

దాహం కాబోలు.

"చంపుతా. ఆలస్యం చేశావంటే—నా కొడుకుతోనుటే నీకు సల్లాపాలు?"

యూసేనూ, కొడుకూ—ఏ లోకంలో సల్లాపాలాడుతున్నారో తన భయంలేకుండా ఇప్పుడు.

నల్లటివాడు, భయంకరుడు, క్రూరుడు, కుడిచెయ్యి కొత్తగా తెగిన అమనుల్లా, ఎడంచేత్తో కత్తిపట్టుకుని వెర్రెత్తినవాడిమల్లె అరుస్తున్నాడు: "ఈ కత్తికి వెయ్యిమంది సిక్కుల్ని బలివ్వకపోతే నేను హూస్సేన్ బీబీకి పుట్టలేదు" అంటూ అటూ ఇటూ పరిగెత్తాడు.

పదిమంది ప్రాణావశిష్టులైన ముసల్మాన్ యువకులు అరిచారు అతనివెంట హీనస్వరాలతో.

"ఇదే అల్లాముందు నా ప్రమాణం. ఈసారి మొదట నా కంటపడ్డ హిందూ సువ్వర్ని చంపకపోతే నా మొహం చూడకండి" అన్నాడు యూసఫ్.

"సెబాస్. సెబాస్" అన్నారు స్త్రీలు, నిప్పులుకక్కే కళ్ళతో ద్రౌపతీ అవతారాల్లాగ.

ఈ ముసలమ్మ మూర్ఛవల్ల నయే ఆలస్యానికి ఆతురత పడుతున్నారు తక్కిన మనుషులు: ఆ శ్రీమంతురాలి చురుకు నాలికవల్ల ఎన్నో ఏళ్లు ఊపిరాడదని పక్క ఇంటివాళ్ళు ఆమె పారేసిన ధర్మంతో బతికిన దరిద్రులూ కూడా.

"ఈమెకోసం ఆలస్యమైతే అందరం చస్తాం" అన్న గుసగుసలు.

ఆకలి, దాహం, గాయాలబాధ! ఎక్కడా శరణ్యంలేదు. ఎటు చూసినా అపాయం. అబ్బా, ఈ ప్రాణం నిలుపుకోవాలనే పట్టు!

నాలుగు పరకల గడ్డపు ముసలివాడు యోచిస్తున్నాడు!

"ఎట్లానూ మరణం తప్పదు మా అందరికీ, ఎప్పుడో కాదు, రేపో, ఎల్లుండో, శత్రువులన్నా చిత్రవధ చేస్తారు. కాకపోతే నీళ్ళులేక, తిండిలేక ఒక్కొక్కరమే దిగబడతాం ఈ ఎడారి మట్టిలో. కాని ఎంత ఆశ! ఎంత పట్టు ప్రాణం! ఆ చివరి నిమిషం వరకూ ఇట్లా నడవాలి. పోవాలి....శూన్యంలోకి అని తెలిసికూడా! ఈ నవాబు బతికితే మాత్రం... ఏం బతుకు? అంతా దగ్ధమయింది. ఇద్దరు అల్లుళ్ళు కూతురు తన కళ్ళ ముందు చీలికలైనారు. ధనం, మందిరం భస్మమైనాయి. కాని ఇంకా ఆశ. దేనికో ఈ ఆశ! అనుకుంటున్నాడు.

"అల్లా! అల్లా! ఎటువంటి వాళ్ళకు ఎట్లాంటి గతిపట్టింది ఒక్క రోజులో" అని ఏడుస్తోంది ఒకమూల, ఒక ఆమె. యిరవై యేళ్ళమట్టి ధనవంతుల ఇంటో తీరిగ్గా తింటున్న బంధువురాలు.

ఎంత స్నేహంగా వున్నారు ఇన్నాళ్ళూ! వాళ్ళ పండగలకి ప్రతి పండగకీ, వాళ్ళ తగలబెటా ఆ రాముడు, ఆ కృష్ణుడు వాళ్ళ చచ్చిన పండగలకి ధాన్యం, డబ్బూ ఇచ్చాడు మామ. ఈ హిందూ కాఫర్లలో ఎంత దుర్మార్గం, కుచ్చితం—అదేదో పేపరు చదువుతాట్ట ఆ భీమసింగ్, రహస్యంగా వినిపించాడు తక్కినవాళ్ళకి. రెచ్చకొట్టాడు...." అంటు న్నాడు ఒక చెంపతెగిన హస్సాన్.

"తురకవాడు అనేవాడు లేకుండా హిందూదేశం వూడ్చివెయ్యాలని ప్రతిహిందువుడి లోలోపలా—అని చదివాం కదూ పత్రికలో!" అన్నాడు జాగిర్‌దార్.

"ఇంకా ఎంతమంది ముసల్మానులు—ఎన్ని వేలా లక్షలు...."

"అవునయ్యా! వాళ్ళ దేశంలోకి వొచ్చి, వాళ్ళని నరికి ఆక్రమించు కుని, వాళ్ళ భూసారాన్ని తిన్న పాపఫలం అనుభవించవొద్దూ!" అన్నాడు నాలుగుపరకల గడ్డం ఆయన.

వాళ్ళ భూమి? వాళ్ళ దేశం!" అని మూలిగాడు రక్తం కారు

తున్న ముక్కుతో ఒక యువకుడు. ఆ ముసలి తురకను నరికేటట్టు చూస్తో.

"ఎందుకు అసలు ఈ తగాదా! మనకీ వాళ్ళకీ అందరికి చోటు లేదూ?" అంది ఒక యవ్వనం అడ్డిపోయిన నౌకరిపిల్ల.

చల్లనిగాలి వీస్తోంది. రాత్రికి చలిగాలి అవుతుంది. ఎక్కడా ఒక్క అడ్డుకూడా కనిపించదు. ఎల్లా రాత్రి గడపడం!

సూర్యుడు ఎర్రనౌతున్నాడు.

సూర్యుడొక్కడే వాళ్ళకి దిక్సూచి, పడమటగా పోవాలి మహమ్మదీయ రాజ్యంలోకి.

ఆ పడమట మన ముసల్మాన్ రాజ్యమా! వాళ్ళు మనమీద దయగా వుంటారా!" అంది సౌందర్యవతి.

"ఆ" అన్నాడు దీనంగా అన్న.

కాని అందరికీ సందేహమే.

ఎవరో ఆ ముసల్మానులు, వీళ్ళని ఆదరిస్తారని ఎందుకు తలచాలి. తినడానికి గోధుమలు లేని కాలంలో:

రైలుకీ, కాలవకీ దూరం వాళ్ళ పల్లెటూరు. లోకంలో ఏం జరుగుతోందో దూరంగానన్నా తెలీదు వాళ్ళకి. ఎక్కడో లండన్‌లో ఢిల్లీలో జరిగే సంభాషణ ఫలితాల్ని అనుభవించడం తప్పితే.

"అసలు సరైన దోవన పోతున్నామా?"

మంచి సందేహం వొచ్చింది. ఆ సందేహాన్ని గట్టిగా రానిస్తే ఇంకేంలేదు. ఇక్కడ చావడమే మంచిది.

"పడమట అదేగా? అటే పోతున్నాము" అని సూర్యుడి కేసి చూస్తున్నాడు. ఆ పెద్ద ఎర్రపడే సూర్యుడికేసీ యూసఫ్.

"చూడు చూడు....అదేమిటి ఏదో గుంపు! హిందువులు, హిందువులు!" అని అరిచాడు వాళ్ళ ఇంటి కావిలివాడు.

గుంపులో కల్లోలం. ఈ కొత్త ప్రాణాలతో బతకనీరు గావును. మెహరీనిస్సా. ఇంతవరకు రహస్యంగా వుంచిన తన ప్రేమను దాచు కోడం మరచిపోయి అమనుల్లాను కావిలించుకుని వొణుకుతోంది.

దిగులుగా, స్థిరంగా పడమటికేసి చూసే యజమాని వాళ్ళని కావి లించుకొని ఏడుస్తున్నాడు సిద్ధీ. "ఏం చెయ్యను? మీ కోసం ఏం చెయ్యను?" అంటున్నాడు మూలుగుతో!

పైగా వీళ్ళ వెనకగా తూర్పునించి ముగ్గురు మనుషులు వొచ్చారు. ముగ్గురూ యువకులు. బజాన మూటలు వేసుకుని నవ్వుకుంటో వొస్తు న్నారు బీడీలు కాలుస్తో. వీళ్ళతో కలిసిందాకా ఎవరూ చూడలేదు వాళ్ళని. ముసలమ్మ ముందు చూసింది వాళ్ళని.

"అరే, అరే, చూడండి" అని అరిచింది భయంతో.

వాళ్ల ముసల్మానులని గుర్తించారు.

"ఎక్కణ్ణించి?" అన్నాడు హస్సాన్.

"లాహోరు."

"ఎక్కడికి?"

"ఏట్లోకి" అని చేదుగా నవ్వాడు వాళ్లలో పొట్టివాడు.

"మీరో?" అన్నాడు ఇంకో అతను.

"అల్లా చెప్పు తీసుకు కొట్టాడు మమ్మల్ని, హిందూ సువ్వర్లు తరి మిన కుక్కలం" అన్నాడు సిద్దీ!

"అవును. దేశమంతా ఇంతే—ఇదే హత్యాకాండ, ముసల్మాన్ పురు గుని బతకనివ్వ తలుచుకోలేదు హిందూ ప్రభుత్వం" అన్నాడు లావాటి వొస్తాద్!

మూడో అతను ఆశతో ఆడవాళ్ళకేసి చూస్తున్నాడు.

"లాహోరులోనూ అంతేనా?"

"దేశమంతటా ఆసేతు హిమాచల పర్యంతమూ అని చెప్పలేదా?"

"మరి ముసల్మాన్లు ఏం చేస్తున్నారు? మనకింక దిక్కులేదా?"

"ఉండండి, ఉండండి. ఎంతకాలం నిద్రపోతాడు దేవుడు?"

"ఈలోపల మనకి ఎక్కడ రక్షణ!"

"పదండి, పోతున్నారుగా పాకిస్థాన్, పాకిస్థాన్ జిందాబాద్!" అని అరిచారు ఆ ముగ్గురూ.

"పాకిస్థానేమిటి? అంటోంది వెనకనించి పెద్ద ఇల్లాలు. నగలా, బిందెలా, చీరెలా, అత్తర్లూ, గేదెలా, కూర్మాలూ మాత్రమే లోకమంటే అర్థం ఆమెకి మొన్నటివరకూ.

"గాంధీ, నెహ్రూ, పటేల్ ముగ్గురు సైతాన్లు ముసల్మాన్ రక్తం తాగుచున్నారు. ఏ పూళ్ళోనైనా సరే ఠాణాదగ్గిర వొప్పగించిన ప్రతి ముసల్మాన్ తలకీ వంద రూపాయలు బహుమాన మిస్తున్నారు" అన్నాడు ఆ కొత్త పొట్టిమనిషి.

ఒక్కపెట్టున అక్కడి గుంపంతా రొమ్ము బాదుకుని గోలుమని ఏడ్చారు.

ముందు సూర్యుడి బింబంలోనుంచి ఆ గుంపు దగ్గిరగా నడిచి వొస్తోంది.

"నీళ్ళు ఉన్నాయా?" అని ముఖం అవతలికి తిప్పుకుని అడిగింది ఆ కొత్తవాళ్ళని ఏడ్చి గొంతుకి ఎండి ఒకామె; అందరికన్న బిగ్గరగా ఏడ్చిన ఆమె.

స్త్రీలు ముసుగులు వేసుకోడం కూడా మరచిపోయారు. పర పురుషుల ముందు.

"ఇక్కడే నది వుండాలి; ఇక్కడ ఆగారేం? ముందుకు రండి" అన్నాడు ఆ ముగ్గురిలో లావాటి మనిషి.

"రాత్రి అక్కడే విశ్రమించవొచ్చు" అన్నాడు రసికుడు.

"ఇంకా ఎంతదూరం పాకిస్థాన్ ?"

"దగ్గిరే, రండి, రేపు సాయంత్రంలోపల...."

ఎదురొచ్చే గుంపుని చూసాడు "లాలా" మాట్టాడే అతని బుజం మీద చెయ్యేసి.

చాలా పెద్ద గుంపు.

"ఎల్లాగూ తప్పదు. రండి ఎదురు పోదాం" అన్నాడు లావాటి వాసాద్.

ఆడవాళ్ళని బాగా వెనకగా వొదిలి ముందు నడుస్తున్నారు మొగ వాళ్లు.

భూమిదృష్టిని వొదిలి సూర్యుడు మబ్బులకి రంగులు వేసే ఆటలో నిమగ్నుడై నాడు.

సమీపిస్తున్న గుంపు దూరంనుంచే వీళ్ళనిచూసి "ముసల్మానులు !" అని అరిచింది.

వెంటనే ఆ అరుపుతో కలిసి "కాఫర్లు !" అని అరిచారు ముసల్మాన్లు.

ఒక్క నిమిషంలో వొస్తున్న హిందువులగుంపు తాము మోసు కొస్తున్న మూటల్ని, గేదెల్ని, కుక్కిమంచాలలో మనుషుల్ని కిందపారేసి ఇటూ అటూ పరుగెత్తింది. ఆడవాళ్ళతోసహా, తిండిలేక, రెండురోజుల నుంచి ఎండిన ముసల్మానులు, చప్పున ఏమూలనించో, మూలగల్లోంచి, క్రోధాన్ని, బలాన్ని పైకిలాగి ఒక్కదూకున వెంబడించారు పెద్ద పెద్ద అరుపులతో.

యూసఫ్ మొదట రక్తబలిని అర్పించాడు. అస్తమిస్తున్న అరుణ కిరణుడికి, కాషాయమైన బురకావేసుకున్న ముసలిగడ్డపు భికారిని వెనక నించి తరిమి, అతని చేతిని పట్టుకు పరిగెత్తుతున్న కన్యనైనా గమనించక కత్తితో బుజంపైన కొట్టి కృతఘ్న ప్రజ్ఞుడైనాడు.

"నాన్నా" అని అరిచి కన్య ఆ ముసలి నెత్తురులో తడిసింది.

తన పరుగునైనా ఆపక ముందుకు పరిగెత్తాడు తక్కిన శరణార్థుల కోసం యూసఫ్.

చూస్తుండగా సుడిగాలికి ఎగిరిన ఆకుల మల్లే రెండు గుంపులూ మాయమైనాయి. చెల్లా చెదురై ఒకరి నొకరు తరుముతో.

నేలతోపాటు గాలికూడా కాంతిలో ఎఱనయింది.

అరుపులు దూరంనుంచి....

నాలుగు పరకల గడ్డమతను పడిపోయిన ముసలి భిక్షకుడి దగ్గిరికి వొచ్చాడు విచారంగా. ఆకాశాన్ని ఏమీ ఎరగని గాజుకళ్ళతో చూస్తున్నాడు కారుతున్న నెత్తురులోపడి ఆ దిక్కుమాలిన ముదుసలి.

"నాన్నా, నాన్నా" అని అతని రొమ్ముమీద పడి రొమ్ముదర ఏడుస్తోంది ఆ పిల.

ముసల్మాన్ స్త్రీలు అరుస్తున్నారు! "చంపండి. చీల్చండి, వీళ్ళకి దేవుడులేడు. గుండెల్లేవు. మనుషుల్ని. పసిపిల్లల్ని పీక్కుతినే సైతాన్లు" అంటో ఏడుస్తో.

ఒకత్తె జుట్టు విరబోసుకుని "రండి రండి" అంటో దూకింది వాళ్ల పరిగెత్తి వొదిలిన ఆ కుక్కిమంచాలమీదికి. ఒకదాంటో ఒక ముసలిరోగి, వెనక వదలలేక కొడుకూ, అల్లుడూ, ఎనభైమైళ్ళు మంచంలో వేసి, తీసుకొచ్చిన ముసలమ్మ, ఒక మంచంలో కాలు తెగిన పదహారేళ్ళ యువకుడూ, మూడో దాంట్లో బాలింత. ఆమె పాపతోపాటు తక్కిన తల్లుల ముగ్గురు పిల్లలు.

ముసల్మాన్ స్త్రీల కళ్ళలో, గోళ్ళలో, రెండురోజుల కిందటి దృశ్యాపుదారుణరక్తపుచారలు. కాకులమల్లే, రాబందులమల్లే అరుస్తో వొచ్చి పడ్డారు. ఆ నిస్సహాయుల్ని పీకారు. కళ్ళు పెరికారు. ఆ యువకుడు చప్పున తనమీదపడ్డ ఇద్దరు యువతుల పీకలూ నులుముతున్నాడు.

ముగ్గురు స్త్రీలు బాలెంతపైన పడ్డారు. ఆమె బలహీనంగా పీకుతోంది వాళ్ళ మొహాల్ని. పసిపిల్లలు చిరునవ్వులు నవ్వారు ఆ అందమైన ముసల్మాన్ స్త్రీల ముఖాలుచూసి.

చల్లగా ప్రశాంతంగా వాయువు వీస్తోంది. పిల్లల్ని నలిపి విసిరి పారేసింది నలుగురుపిల్లలమాత. తనముందు మొన్న కెవ్వుమని అరిచి చచ్చిన తన శిశువు ముఖం తలుచుకుంటో.

పారిపోయిన హిందువుల్లో ఒక అతను ఎటునించి తప్పించుకుని వొచ్చాడో చప్పున యీ ముసల్మాను స్త్రీలమీద పడి, ఇటూఅటూ కొట్టి పరిగెత్తాడు వాళ్ళ రక్షణార్ధం వొస్తున్న జాగీర్దారుని చూసి, జాగీర్దార్ కత్తి విసిరి అతని వీపున పెద్ద రక్తపుచారగా నరికాడు.

ఈ లోపల నాలుగు పరకలగడ్డం సాయెబు దెబ్బతిన్న భిక్షకుడితో ఆ పిల్లతో మాట్లాడుతున్నవాడు అటువొచ్చిన జాగీర్దారుని రమ్మని సౌజ్ఞ చేశాడు. ఆ మైదానానికంతా ప్రభువైన రాజఠీవితో, ఎర్రనికత్తి, గొప్ప వొంటిచాయ, అరుణిమ విశాలనేత్రాలు, నల్లటిగడ్డం, అజానుబాహువు, అతను వెళ్ళి నిదానంగా వింటున్నాడు ఆ జాగీర్‌దార్, హిందువులకు జరుగుతున్న శాస్తికి ఉబ్బొంగుతో.

"ఎందుకు మమ్మల్ని కొట్టారు ? ఎందుకు చంపుతున్నారు ? మేము మిమ్మల్నేం చేశాము ?" అంటున్నాడు గడ్డమాడిస్తో దెబ్బతిన్న ముసలి భిక్షకుడు.

"ఓరీ ద్రోహీ ! అబద్దాలకోర్ ? ఎంతమంది ముసల్మానుల్ని నరికావురా ? మమ్మల్ని బతకనీరటగా, తురకవాణ్ణి లేకండా వూడుస్తా రటగా ? ఏంచేశారా ? రా, వొచ్చిచూడు మావూరు, చూడు ఆ ఆడవాళ్ళని. చూడు ఆ పిల్లల్ని !...." అంటో ఓ తన్ను తన్నాడు. చచ్చే ఆ ముసలివాడి డొక్కలో.

"క్షేమా? క్షేమా?"

"మీరే! నువ్వే! నీ వాళ్ళే! నీ కుక్కలే.

"లేదు. ఈశ్వరసాక్షిగా లేదు. మే మేమెరగం ఒక్క హిందు వుడూ ఏమీ చెయ్యలేదు...."

నవ్వుతున్నాడు పడమట అస్తమించే సూర్యుడు, తూర్పు వేపు మబ్బుల్లో మొన్నటి ముసల్మాన్ రక్తపు ఎరుపునుచూసి.

"మహమ్మదీయులే, హిందువుల వూళ్ళపై పడ్డారు. ఆడవాళ్ళని ఎత్తుకుపోయారు. మొగవాళ్ళని నరికారు. నా కొడుకుని నాయెదుట నిలువునా మంటపెట్టి కాల్చారు. ఏం చెయ్యలేదు మేము, దైవసాక్షి ఏ మెరగం."

"నిజమా! ఎక్కడికి పోతున్నారు?"

"తూర్పుకి హిందూ పంజాబుకి."

"హిందూ పంజాబా! పంజాబంతా ఒకటికాదా?" అన్నాడు నాలుగు పరకల సాహేబు.

"కాదుట. అందుకనే ఈ ఘోరం. నరుకుతున్నారు. హిందూపురుగు లేకుండా నరుకుతున్నారు."

"నాన్నా! నాన్నా!" అని యేడుస్తోంది కన్య. ఆమె కంఠం చుట్టూ వున్న ముసలివాడిచెయ్యి వేళ్ళాడుతోంది. కళ్ళకి పొరలు కమ్ముతున్నాయి.

"సాహెబ్ నా మాటలు నమ్మండి, మమ్మల్ని ముసల్మానులు తరిమి వెళ్ళకొట్టారు. మావూరికంతా మేమే మిగిలాం....మమ్మల్ని చంపారు. మీరు. మీకేం అపకారం చేశాం? మీరు మాత్రం ఏం చేశారు? కర్మ. కర్మ, కర్మ...."

ఒక్కనిమిషం ఊపిరి తీసుకుని, జాలిగా కూతురివంక చూశాడు.

"సాహెబ్! దైవం నిన్ను దీవిస్తాడు, నేను పోతున్నాను. ఒక్క సహాయం చెయ్యి, నీ పాదాలు పట్టుకుంటాను. ఆ కత్తితో నా కూతురు తల నరుకు!"

విస్మితుడై, నిస్తబ్దుడై చూశాడు జాగీర్‌దార్.

"ఏమిటి! ఎందుకు? ... నిజమా నీ మాటలు?"

"నిజం కాకపోతే, మావూళ్ళు వొదిలి ఎందుకు ఇట్లా వొస్తాం. దైవసాక్షి నమ్మండి."

ఎందుకు హింసించారు ముసల్మాన్లు మిమ్మల్ని!"

"ఏమో! మాకేంతెలుసు? మొగవాళ్ళందరూ పొలానికిపోయారు. వొచ్చిపడ్డారు. దోచుకుపొండి, తీసుకుపొండి అన్నారు ఆడవాళ్ళు, హర హరా! ఏం చెప్పను. పసిపిల్లల్ని మానభంగం చేశారు. గుర్రాలమీద వేసుకు తీసుకుపోయారు, అరుస్తున్న ఆడవాళ్ళని. ఇళ్ళ మంటలుచూసి పరిగెత్తు కొచ్చారు మొగాళ్ళు. అప్పటికే పోయినారు ముసల్మాన్లు, మొగాళ్ళకోసం మళ్ళీ వొస్తామని బెదిరిస్తో. మమ్మల్ని అడక్కుండా, పలకరించకండా, ఇల్లా మీద పడ్డారు మీరు. మీముఖం చూస్తే నాకు గౌరవం కలుగుతోంది. ఎందుకు మనుషులు అకస్మాత్తుగా ఇట్లా పులులూ, తోడేళ్ళూ ఐనారో తెలీదు....దీన్ని చంపండి. నా చేతులలో బలముంటే నేనే చంపుదును. ఎల్లాగో రక్షించుకు వొచ్చాను దీన్ని, నా కాలం మూడింది. ఎవరుదిక్కు దీనికి? వొస్తారు మీ వాళ్లు....వాళ్లు వొచ్చారా, నా ముత్యాన్ని, నా కూతుర్ని....నేనూ, చూశాను ఆడదాన్ని ఏం చేస్తారో!"

ఏడ్చాడు.

చప్పున జాగీర్దార్ ముసలివాడి రొమ్ముమీదపడి ఏడ్చాడు.

"దాదా భయపడకు. అల్లామీద, కొరాన్‌మీద, ప్రమాణం చేస్తున్నాను, నేను మాట ఆడి తప్పను. నా కంఠంలో ప్రాణం వుండగా నీ కూతురుకి ఏ ఆపదా రాదు.

"దాని మతం...."

"ఏం భయపడకు. నీ కూతురు నాకూతురు, నా హిందూకూతురు." అన్నాడు.

ఆకాశంలో పువ్వులు నవ్వాయి.

నాల్గుపరకల తురకతను ఒక్క అరుపు అరిచాడు. ముసలివాడి చివరిసరకల్ని దిగులుతో చూస్తూన్న జాగీర్దార్ మీద దూకాడు ఒక పీల యువకుడు ఒక నాటుబల్లెం పట్టుకుని, జాగీర్దార్ చప్పున వెనక్కి తిరిగాడు. బల్లెం అతనిభుజాన్ని కొంచెం పక్కగా దూసుకుపోయింది. చొక్కా ఎఱ్ఱ పడ్డది. ఆ ఒక్క హిందువుని మెడపట్టుకుని "ఏంచేద్దాం" అన్నట్లు చూస్తు న్నాడు అతను.

చచ్చిపోతున్న ముసలి అతను "భగవాన్" అన్నాడు.

జాగీర్దార్ బల్లెం దూరంగా పారేసి, హిందువును వొదిలి "ఇస్లాం" అన్నాడు.

క్రమంగా పరుగెత్తినవాళ్ళు ఇద్దరు ముగ్గురుగా చేరుకుంటున్నారు పారిపోయిన హిందువుల్ని లాక్కుని. కొందరు దోవలో వాళ్ళని జుట్టు పట్టుకుని తంతున్నారు. నడవలేనివాళ్ళని యీడుస్తున్నారు కిందపడేసి.

బాగా సాయంత్రమయింది హిందువులు మూలుగుతో, బెదురుతో, విరోధులవంక చూస్తో పడివున్నారు కుప్పగా మైదానం మధ్య.

"ఏంచేద్దాం పీళ్ళని!" అన్నాడు అమానుల్లా.

పసిపిల్లలు బలహీనంగా "కేవు కేవు" మంటున్నారు.

"అయ్యా, హాజరత్, నన్ను చంపెయ్యండి. బాధ భరించలేను" అన్నాడు కడుపులో కత్తిపోటుతిన్న మనిషి.

"నిన్ను? నిన్ను చంపుతామా? అప్పుడే! పాపఖర్మడా— చెక్కుతాం నిన్నూ, నీవాళ్ళనీ, మా ముసలివాళ్ళనీ, పసిపిల్లల్నీ నరకడమనుకున్నావా? అనుభవిద్దురుగాని, రాత్రంతా ముక్క ముక్కలుగా నరికి బలిపెడతాం చచ్చిన మావాళ్ల ఆత్మశాంతికి."

"మేమా? మే మెవరిని నరికాం?" అన్నారు నలుగురు, ముగ్గురు.

"వీళ్ళనా, వీళ్ళని ముందు చర్మం వొలవండి. వాళ్ళ మాటల్లో ఉప్పూ కారం ఉందేమో తియ్యండి" అంది ముసల్‌మాన్ ముసలమ్మ" దవడచీలిన మనిషి కష్టంగా,

"నన్ను చంపెయ్యి, చంపెయ్యి" అని పక్కనున్న మనిషిని అడుగుతున్నాడు డొక్కలో పోటుతిన్న కాందిశీకుడు.

"చూడు, దయలేదా? కొడుకా, నిన్ను నా చేతుల్తో పెంచాను. నన్ను తగలేస్తావనుకున్నాను. ఒరే నీ చేతులతోనే చంపు. భరించలేను ఈ బాధ. నీ కడుపున...." అని ఆగాడు, తన కొడుకు మాత్రం ఎక్కడ మిగులుతాడు ?

జాగీర్‌దార్ ఆజ్ఞకోసం కాచుకుని ఉన్నారు గావును. అతని దృష్టి వీళ్ళమీద లేదు. తన హర్మ్యం, తన తోటలు, తగలబడ్డ తన ఊరు, తన కళ్ళఎదుట చచ్చిన తన పిల్లలు... కసి, కసి, కసి... ఎట్లా ఆ కసిని భరించడం? కసిని చూపడానికి మనుషులు దొరకడంతో ఆ కసి విజృంభించింది. బలి తీసుకోకపోతే కసిదేవతకి శాంతిలేదు.

కాని, ఆ పెద్ద మైదానం, మతం, కులం, వివక్షత లేకుండా అందర్నీ కలిపే గాలి, ఆకాశంనించి దేవతలు భూమికి వర్షించే శాంతమైన సంధ్యాకాంతి, ఇంక వేరు ప్రాణి కనపడనిచోట, ఈ కూడుకున్న ప్రాణుల మధ్య మిగిలిన మానుషత్వం, సోదరత్వం ఏమూలో వాళ్ళ హృదయాలలో అడుగునించి ఏం పని చేస్తోందో ఎవరికి తెలుసు? ఈ కాందిశీకులు నిర్దోషులనీ, ఎవరినీ చంపలేదనీ, తమకి ఘాతకం చేసినవాళ్ళకీ, వీళ్ళకీ ఏ సంబంధమూ లేదనీ, ఎక్కడో ఆలోచనల మడతలలో చీకట్లో స్ఫురిస్తోంది గావును.

కాని, కసి....కసి.

"నీళ్లు, నీళ్లు" అంటున్నాడు డొక్కలోనించి నీళ్ళమల్లే కారుతున్న నెత్తురు మనిషి. కాలు తెగిన కొడుకు పాక్కుంటూ వెళ్ళి నీళ్ళ తోలుతిత్తి తంత్రీ నోటి కందిస్తున్నాడు.

(20)

ఆ దృశ్యంతో చప్పున మేలుకుంది తురకలలో నీటిదాహం, రక్త దాహం. చప్పున యూసఫ్ ఒక్కదూకుతో ఆ కొడుకుమీద పడి నీళ్ళతిత్తిని లాక్కొని తన నోట్లో పెట్టుకున్నాడు. దాంతో అందరికీ రేగింది నీళ్ళవెర్రి. ఇంకా ఆ తండ్రి నీళ్ల కోసం నోరుతెరుచుకునేవున్నాడు. రక్తం గడ్డకట్టిన కళ్లని తెరవడం చేతకాక.

ఆడవాళ్లతోసహా "నీళ్ళు, నీళ్ళు," అంటో తోసుకుంటో కిందపడి వున్నవాళ్లని తొక్కుతో, తంతో ఏ ఆలోచనా లేకుండా, తల్లి కూతుళ్ళు, పెద్దలు, పసిపిల్లలు ఎగపడ్డారు. జాగీర్‌దార్ యూసఫ్ దగ్గిరికి వెళ్లి చంప మీద కొట్టి, ఆ తోలుతిత్తి తీసుకున్నాడు. తన తండ్రేనా కొట్టింది అని విభ్రమపడి నుంచున్నాడు యూసఫ్, కోపం అవమానం మండిపోతో. జాగీర్‌దార్ కష్టంతో వొంగి నీళ్లడిగిన కాందిశీకుడి నోట్లో నీళ్లపోశాడు. ఆ తిత్తిని అట్లా పట్టుకుని నుంచున్నాడు ఆలోచిస్తో.

సూర్యుడు అస్తమించాడు. ఆకాశం ఎరుపు పోయింది. ఆ చీకట్లో ఆ తిత్తిని పట్టుకుని జాగీర్‌దార్ అమితంగా ఔన్నత్యాన్ని పొందినట్టు ఫీలయాడు. కారణంలేకుండా అందరి కళ్లూ అతనిపై నిలిచాయి. దేవత్వమే అతని కళ్లలో మెరిసినట్లయింది.

రెండో ముసల్మాన్ ముసలమ్మ, జాగీర్‌దార్ పినతల్లి, "అయ్యో, నా కొడకా!" అని ఒక్క అరుపు అరిచింది. ఆ అరుపు సిగ్నల్ ల్లాగు తురకలు అమాంతం, నిరాయుధులైన హిందువుల మీద ఆర్తులై, కింద పడివున్న దౌర్భాగ్యులపైన విరుచుకపడ్డారు. దబదబ బాదేశారు. అరుపులు ఏడుపులు, రక్తం, జాగీర్‌దార్ ముందున్న స్త్రీ తన నోట్లో నుంచి దెబ్బకి రాలిన పళ్ళని రక్తంతో ఉమ్మేస్తోంది. ఆమె పక్క కుర్రాడు, ఎందుకు ఎవరు తనని కొడుతున్నారో అర్థంకాక. "నాన్నా నాన్నా" అని అరిచాడు. ఆ నాన్న నడుంమీద తగిలినదెబ్బతో స్పృహ తప్పి పడ్డవాడు తెప్పరిల్లుతో, "నాయనా, సుమేర్" అని హీనంగా అంటో

మళ్ళీ పడిపోయాడు. ముస్లిం ఆడవాళ్ళు కదులుతున్నారు తమ గర్భశోకాలకి, రక్తంతో శాంతి తెచ్చుకుందామని.

"ఆగండి" అని అంటోతురంకె వేశాడు జాగీర్‌దార్.

ఒక్క నిమిషం అతను గమనించలేదు ఏం జరుగుతోందో. ఈ దృశ్యం అలవాటైపోయింది. ఎవరి నెవరు నరుకుతున్నారో నిజంగా ఇది జరుగుతోందో, కలో, ఈ రెండు రోజుల్లో ఇంతరక్తం తాను చూడడం నిజమో, కాదో అర్థంకాని స్థితిలో పడివున్నాడు ఇంతసేపూ.

జరుగుతున్న ఘోరం అర్థమయిం తరవాత "భేష్" అందీ అతని లోపలి కసి. ఆ కసినిమించిన తన సహజ ఔన్నత్యాన్ని, న్యాయాన్ని, పాపభీతిని అతను ప్రయత్నించి పైకి తెచ్చుకుని అరవాల్సి వొచ్చింది.

చప్పున ఆగారు.

కాని, అమానుల్లామాత్రం తదేకదీక్షతో, శస్త్రవైద్యుడివలె, తన బాకుతో, అప్పుడే పమిట వేసుకున్న బాలికని కిందతోసి, కనుగుడ్లని తాటెముంజలలాగు పైకి పెకలిస్తున్నాడు. జాగీర్‌దార్ ఒక్క గంతువేసి ఒక్కతన్నుతో అమానుల్లాని పక్కకి పడవేశాడు.

"వినండి, ఆగండి, మనం చేస్తున్నపని ఘోరం. వీళ్ళు మనకేమీ అపకారం చెయ్యలేదు. ఏ ముస్లింకీ హానిచెయ్యలేదు. వీళ్ళని ఎందుకిట్లా హింసిస్తున్నాము మనం? మనపిల్లల్ని నరికింది వీళ్ళా! మన ఇళ్ళని కాల్చింది వీళ్ళా?".

ఆగాడు.

"వీళ్ళవాళ్ళే."

"ఈ హిందూ సువ్వర్లే"

"చాతనైతే వీళ్ళు మనల్ని నరక్కుండా వొదలుతారా?"

అన్నారు యోధులు.

కాని వాళ్ళకంఠంలో ద్వేషబలం సన్నగిలింది ఆలోచనలతో కసి కొంత తీరడంచేత.

చీకటి నాలుగు మూలల్నించీ పైకిలేచి ఆకాశాన్ని అలుకుతోంది. శనేశ్వరుడు నెత్తిమీదనించి తొంగిచూస్తున్నాడు. పక్కల్నించి కీచు కీచు మంటున్నాయి పురుగులు పొదల్లో.

"చూడండి, ఒకవేళ మనకన్న బలవంతులై యీహిందువులు మననే ఇట్లా హింసించారనుకోండి. ముసల్మానులమనే కారణంతో. మనకే మని పిస్తుంది? "హిందువులవల్ల ఇంత హింసపడి, దిక్కులేక ఎడారినపడ్డ నిర్దోషుల్ని మనని, ఎవరో ముసల్మానులు వారిని హింసించారని, మనల్ని అన్యాయంగా మూర్ఖులై చిత్రవధ చేస్తారా ఈ హిందువులు అని ఏడ్చి వుండమా?" అన్నాడు నాలుగుపరకల గడ్డమతను.

క్రోధం కింద, బాధకింద, మూర్ఖపు చీకట్లకింద అణగివున్న న్యాయ భావం చాలాగట్టిగా, ఆలోచల్ని చీల్చుకుని తలెత్తడం ప్రారంభించింది. ఏదో దయ, సానుభూతి, తాముచేసిన పనికి సిగ్గు—అట్లా నుంచుని చూస్తు న్నారు. ప్రతివారికీ ఏదో పరిహారం చెయ్యాలని, దయ చూపాలని, సోద రత్వం కలుపుకోవాలని అనిపిస్తోంది. కాని, కార్యరూపంలోకి తీసుకు రావడం ప్రతి వారికి అభిమానమయింది.

పూర్తిగా చీకటుయింది హిందూ ముసల్మానుల రూపం భేదం కూడా తుడిచేసి దయతో ప్రాణికోటిని ఐక్యంచేసింది అంధకారం.

కిందపడేసి కొడితే దిమ్మతిరిగి సగంప్రాణం పోయిన హిందూ పసి పిల్ల తెలివొచ్చి బిగ్గరగా ఏడ్చింది. మూలుగుల శబ్దాల్నిమించి, చప్పున చాంద్‌బీబీ ఆ పిల్ల నెత్తుకుని, రెండు రోజులనించి తాగడానికి పిల్ల లేని తన స్తనాన్ని యీ తల్లిలేని హిందూపిల్ల నూట్లో పెట్టింది. ఆ గొప్ప నిర్వ్యాజమైన అనురాగంతో, ద్వేషపుగట్లు తెగినట్టు, ముసల్మానులు దెబ్బతిన్న హిందులపై పడి, కట్టుకట్టేవారు, గాయాలు తుడిచేవారు,

ఆ తిత్తిలో నీరు కొంచెం, కొంచెం. తాగించేవారు— ఆ దృశ్యం నక్షత్రాల వెనుకనించి దేవతలే సఫలతతో చూస్తున్నారనిపించింది.

"నిన్నిక్కడ కొట్టానా?"

"కాలు విరిగిందా? ఫరవాలేదు, నయమవుతుంది."

"ఏడవకు. దేవుడున్నాడు. భారం అతనిమీద వెయ్యి."

మోసుకునిపోయి మెత్తని స్థలాల పడుకోపెట్టే ముసల్మానుల మెడలచుట్టూ చేతులువేసిన హిందువుల్నిచూస్తే, ఆ వైరం, ఆ ఘాతుకం వుత్త దుస్వప్నంలాగు తోచింది.

రాత్రి పదింటికి చల్లగా చంద్రోదయమయింది. చచ్చిపోయిన భిక్షుకుడికన్య, జాగీర్‌దార్ కాళ్లపడుతోంది. డోలీలో తీసుకొచ్చిన హిందూ యువకుడికి స్మృతివొచ్చింది, ఆ చల్లగాలికి. అతనికి ఓ కాలు పూర్తిగా విరిగిపోయింది వాళ్ళవూళ్ళో దెబ్బలాటల్లోనే. అతన్ని ఇన్ని మైళ్ళు మోసుకొచ్చారు. అతను కళ్లతెరిచి ఈ దృశ్యాన్నంతా వింతగా చూశాడు.

"దాహం, దాహం."

అమానుల్లా ఒక్కరవ్వ నీళ్ళిచ్చాడు.

"ఇంకలేవు" అన్నాడు.

"ముసల్‌మాన్" అన్నాడు యువకుడు.

"మా నాన్న ఏడీ!" అన్నాడు మళ్ళీ.

"ఇక్కడ వున్నాను నాయనా" అన్నాడు కొంచెందూరంనించి తల పగిలి మరణిస్తున్న తండ్రి.

"వున్నావా? ఇంకా వున్నావా?" అన్నాడు క్రూరంగా కొడుకు.

"తెల్లారేటప్పటికి వుండను."

"ఏమిటి? పీక్లెవరు?" అన్నాడు యువకుడు.

చెప్పారు సంగతి.

"బాగా జరిగింది. ఎంత బతిమాలి చెప్పాను మీకు. ఇళ్ళువాకిళ్ళను వొదిలి కదలవొద్దని. ఎందుకు ఆదేశించాడో నా గురువు, సర్వజ్ఞుడు. ఆయన మాటకి బద్ధులంకావడమే మనక్షేమమన్నానా? స్పృహతప్పిన నన్ను మోసుకొచ్చారు ఫలితం అనుభవించారు" అని పళ్ళుకొరికి ఏడవడం ప్రారంభించాడు.

"గురువేమిటి?" అన్నాడు హుస్సాన్.

ఇంకో ఆయన అంటున్నాడు. ఆ యువకుడి బావ "గాంధీ" ఆ గాంధీని చూడనన్నాలేదు మావాడు. కొడుతున్నా, కాలుస్తున్నా, ప్రతీకారం కూడదన్నాడట ఆయన. మావూళ్ళోకొట్లాటల్లో శాంతం, శాంతం అంటూ అడ్డంవెడితే కాలు విరిచారు వీడికి. వాణ్ణి విడవలేక, కుక్క సవారీలో బజాలు పడిపోయేట్టు. ఇంతదూరం తీసుకొస్తే. మధ్య దోవలో మమ్మల్ని తిట్టి దాంట్లోంచి దూకాడు గురువు ఆజ్ఞ అంటూ. ఎక్కడవున్నవాళ్ళు అక్కడే చావండి. కాని కదలవొద్దన్నాట్ట, వీడి గురువు. చిన్నప్పుడు "కాసబియాంకా" పాఠం చదివాం. ఆ గతే పడుతుంది ఇల్లాంటివాళ్ళకి, అని వాడి ధోరణి."

"గాంధీ తిరిగి హింసించవొద్దన్నాడా? మరి ప్రతి ముసల్మాన్ తలకీ వందరూపాయలు బహుమానం ఇప్పిస్తున్నాట్ట?" అన్నాడు జాగీర్‌దార్.

"ఆఁ, ఆఁ, ఎవరు ఆ మాట అన్నది? వాడి తల బద్దలుకానూ— వాడి నాలిక పీలికలుగానూ. ఎవడు అన్నది?" అంటూ లేవబోయి కూల పడ్డాడు యువకుడు.

"శాంతం, శాంతం" అన్నాడు జాగీర్‌దార్.

నివ్వెరబోయి చూశాడు ఆ యువకుడు గడ్డపు జాగీదార్ని. కాళ్ళ పట్టే యువతినీ, ముసల్మాన్ నోటినించి శాంతం ఇస్లాం!

"అవును. ఈ కేకలూ, ఈ క్రోధం, తన మంచి పేర్లకోసమైనా సరే, అపరాధమేనంటాడు నా గురువు నా గాంధీ...క్షమించండి.

కానీ, ఎవరన్నది ఆ మాట? పరమ అసత్యం. గాంధీ? గాంధీని ఎట్లా అనగలిగారు ఆ మాట! ఎవరు తెలియని సోదరుడు ఆ అసత్యాన్ని పలికింది?"

"పీఖ్యా—" అని చుట్టూచూశారు.

ఆ తూర్పునించి వొచ్చిన ముగ్గురు యోధులు లేరు. ఎప్పుడు వెళ్ళిపోయారో!

ఆకాశం చల్లని మంచుతుప్పరల్ని రాల్చింది గాయం చేసుకున్న తన పిల్లలమీద.